

కాంగ్రెస్ పార్టీ నాయకుల నిర్బంధం

ప్రజాశక్తి-నిడదవోలు

మెగా డిఎస్‌సి కోసం కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి ఆ పార్టీ నాయకులు వెళ్లకుండా పోలీసులు అర్ధరాత్రి 12 గంటల సమయంలో వారిని నిర్బంధించారు. వారి ఇళ్లకు వచ్చి 149 నోటీసు ఇచ్చి గృహ నిర్బంధం చేశారు. వైసిపి ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరిస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కారింకి వెంకటేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ అగర్వాల్ హీరాలాల్, యువజన అధ్యక్షుడు మహమ్మద్ అన్వర్ ఖాన్ తదితరులకు అర్ధరాత్రి సమయంలో నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఖండించారు.

కొండ దిగని బియ్యం ధరలు

26 కేజీల సన్న బియ్యం బస్తా రూ.1700
ధరల నియంత్రణకు చొరవ శూన్యం



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

బియ్యం ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ధరలు రోజు రోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. గడిచిన నెల వ్యవధిలో పది శాతం పైగా బియ్యం ధరలు పెరిగాయి. మధ్య తరగతి, ఆ పై వర్గాల వారు సన్న బియ్యంపై మొగ్గు చూపిస్తుండడంతో రకరకాల పేర్లతో వ్యాపారులు బియ్యం ధరలను పెంచేస్తున్నారు. సామాన్యులు, చిరు ద్యోగులు, వివిధ రకాల వృత్తులపై ఆధార పడిన వారు పెరుగుతున్న బియ్యం ధరలను భరించలేకపోతున్నారు. గతంలో సన్న రకం బియ్యం వెరైటిని బట్టి 26 కేజీల బస్తా రూ.1,150 నుంచి రూ.1,300 వరకు ఉండేది. ఇప్పుడు ఆ ధర రూ.1,400 నుంచి రూ.1,700 వరకు పెరిగింది. గత ఆరు నెల్లో రూ.250 నుంచి రూ.400 వరకు ధరలు పెరిగాయి. ప్రభుత్వం నుంచి లైసెన్సు పొంది జిఎస్‌టి పరిధిలో ఉంటూ హోల్‌సేల్ డీలర్లు, ట్రేడర్లు బియ్యం ధరలను విచ్చలవిడిగా పెంచుతుంటే సివిల్ సప్లయిస్ అధికారులు నియంత్రించలేకపోతున్నారు. బియ్యం ధరలు కేజీ ఒక్కంటికి రూ.45 నుంచి రూ.60 వరకు ఉన్నాయి. సన్నరకం, హెచ్‌ఎంటి, స్టీమ్ రకరకాల పేర్లతో బియ్యం ధరలను పెంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయంటూ కొన్ని రకాల బియ్యం ధరలను మరింత పెంచుతున్నారు. బియ్యం సంచులపై వివిధ రకాల బ్రాండ్ పేర్లు మాపించి సూపర్ ఫైన్ రకం అంటూ 26 కేజీల బస్తా రూ.1,500 నుంచి రూ.1,650కి వ్యాపారులు అమ్ముతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రైస్ మిల్లుల నుంచి బియ్యం ఇతర రాష్ట్రాలకు ఎగుమతవుతున్నాయి. దీంతో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్న బియ్యం ధరలను చూసి ప్రజలు ఆందోళన చెందుతుంటే సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని గతంలో మిల్లింగ్ చేయించి బియ్యాన్ని వినియోగించుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అధిక శాతం రైతులు తమ ధాన్యాన్ని పూర్తిగా అమ్మేసి సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో బియ్యానికి డిమాండ్ పెరిగింది. వినియోగదారులు పెరగడంతో ధరలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత రేషన్ బియ్యం వినియోగదారుల నుంచి బహిరంగ మార్కెట్‌లోకి చేరుకుంటోంది. ఎక్కువ శాతం మంది ఉచిత బియ్యాన్ని కేజీ రూ.15 నుంచి రూ.18కు వ్యాపారులకు అమ్మేస్తున్నారు. దీంతో సన్న బియ్యం, మధ్య రకం బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి.



పులి అడుగుజాడలను పరిశీలిస్తున్న అధికారులు

తాళ్లపూడిలో పులి సంచారం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో పులి సంచరిస్తోందన్న విషయం గురువారం ఉదయం వ్యాపించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని మలకపల్లి గ్రామం నుంచి తిరుగుడుమెట్ట వెళ్లే దారిలో పామాయిల్ తోట వద్ద గురువారం ఉదయం సమయంలో పులి అడుగుజాడల్ని చూసిన రైతులు ప్రజలు విషయాన్ని రెవెన్యూ శాఖ అధికారులకు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి అటవీశాఖ అధికారులు, పోలీసులతో సంఘటనా ప్రదేశాన్ని సందర్శించారు. అవి పులి అడుగులేనని గుర్తించారు. సుమారు నాలుగు రోజులకు పైగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో సంచరించిన పులి అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని గుర్తించిన అధికారులు తిరిగి మరలా రెండు రోజుల క్రితం గోపాలపురం దేవరపల్లి మండలాల్లో సంచరించినట్లు గుర్తించారు. గోపాలపురం మండలంలోని వెంకటాయపాలెంలో పులి సంచారాన్ని గుర్తించగా ఈ గ్రామానికి దగ్గరగా గల తాళ్లపూడి మండలంలో మలకపల్లి తిరుపతి గ్రామాల మధ్య గురువారం గుర్తించామని రాజమహేంద్రవరం డిఎఫ్‌ఒ నాగరాజు తెలిపారు. డిఎఫ్‌ఒ మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల ప్రజలతో పాటు తాళ్లపూడి చుట్టుపక్కల మండల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. గ్రామానికి దగ్గరలో పోయి సంచరిస్తున్న విషయాన్ని ఆయా గ్రామ పంచాయతీలు టామ్ టామ్ ద్వారా ప్రజలకు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

మాట్లాడుతూ, జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు 52 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వెలగపూడి నుంచి గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టర్ క్యాంప్‌కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత, ఇంటర్మీడియేట్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 41,304 మంది హాజరు కానుండగా వారిలో మొదటి ఏడాది 21,288 మంది, 2వ ఏడాది 20,016 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరిలో ఇంటర్మీడియేట్‌కి 37,502 మంది, వొకేషనల్ కోర్సు 3,802 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పరీక్షలకి హాజరయ్యే అభ్యర్థులకు హాల్ టికెట్ల్ జారీ విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వము జారీ చేసిన హాల్ టిక్కెట్లు ఆయా కాలేజీల యాజమాన్యాల లాగిన్‌కు పంపించినట్టు సూచించారు. విద్యార్థులకు ఆయా కాలేజీ యాజమాన్యాలను సంప్రదించి హాల్ టికెట్స్ పొందాలని కలెక్టర్ సూచించారు. రాబోయే రెండు రోజుల్లో పబ్లిక్ డొమైన్‌లో హాల్‌టికెట్స్ అందుబాటులో ఉంచుతామని చెప్పారు. మార్చి ఒకటిన మొదటి ఏడాది ఇంటర్, వొకేషనల్ కోర్స్, మార్చి రెండవ తేదీ నుంచి రెండవ ఏడాది ఇంటర్, వొకేషనల్ కోర్సుకు పరీక్షలు ప్రారంభం అవుతాయని, మార్చి 20వ తేదీతో పరీక్షలు పూర్తి అవుతాయని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకి ర్యాండమ్ విధానంలో పరీక్షా కేంద్రాల కేటాయింపు జరుగుతోందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్ తదితర అంశాలకు చెందిన ఏదైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే ప్రాంతీయ ఇంటర్మీడియేట్ కార్యాలయం, రాజమహేంద్రవరంలోని కంట్రోల్ రూం ద్వారా సమాచారం అందించనున్నట్లు ఆర్‌ఐఒ ఎ.శారద తెలిపారు. కంట్రోల్ రూమ్ నంబర్లు 9492226232, ల్యాండ్ నంబర్ 0883 – 2473430లను పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఉదయం 7 నుంచి రాత్రి 7 వరకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి జెవిఎల్ సుబ్రహ్మణ్యం, జిల్లా వొకేషనల్ కోర్సు అధికారి ఎన్ఎస్‌విఎల్.నరసింహం పాల్గొన్నారు.

మార్చి 1న ఆపరేషన్ వాలంటైన్ రిలీజ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మార్చి 1న ఆపరేషన్ వ్యాలంటైన్ సినిమా రిలీజ్ చేస్తున్నామని హీరో వరుణ్ తేజ్ ప్రకటించారు. పశ్చిమ గోదావరి జిల్లా మిలటరీ మాధవరం వెళ్లి సైనికుల కుటుంబాల ఆశీస్సులు తీసుకున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరంలోమ గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి సినిమాకూ తాను రాజమండ్రి వస్తానని, తన అమ్మమ్మ పక్కనే ఉన్న నిడదవోలులో ఉంటారని వరుణ్ తేజ్ తెలిపారు. ఆపరేషన్ వాలంటైన్ సినిమా సిఆర్‌పిఎఫ్ బ్యాక్ గ్రౌండ్ కథాంశంగా ఉంటుందని వివరించారు. పుల్వామా, బాలాకోట్ ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించామని ఆయన చెప్పారు. టెర్రరిస్టులను మన సైనికులు ఎలా మట్టుబెట్టారనేది, మన వారిని ఎలా కాపాడారనేది సినిమాలో చూపించామన్నారు. లవ్ స్టోరీ, కామెడీ, కమర్షియల్ సినిమాలే కాక ఆర్మీ కష్టాలపై సినిమా తీయడం తనకు సంతోషంగా ఉందన్నారు. త్వరలో మట్కా అనే సినిమా చేస్తున్నానని హీరో వరుణ్ తేజ్ వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరుణ్ తేజ్

14 నుంచి పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి - గోపాలపురం

మార్చి 14 నుంచి ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు కొనుగోలు అన్ని వేలం కేంద్రాల్లో ప్రారంభించనున్నట్లు రాజమహేంద్రవరం రీజియన్ మేనేజర్ ఆదిశేషయ్య గురువారం తెలిపారు. గుంటూరులో పొగాకు బోర్డ్ రైతు భవన్‌లో ఛైర్మన్ సిహెచ్.యశ్వంత్‌కుమార్, ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో పొగాకు రైతులతో బుధవారం సమావేశం జరిగినట్లు ఆయన తెలిపారు. ఎన్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల అధ్యక్షులు, ముఖ్య రైతులు హాజరైనట్లు తెలిపారు. గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల అధికారులు అమల్ డి.శ్యామ్, ప్రసాద్, రైతు నాయకులు గద్దె శేషగిరి, పిన్నమనేని మధు మోహన్, యిల్లూరి రాంబాబు పాల్గొన్నారు.

25న డాగ్‌షో ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలో ప్రారంభం అవుతాయని బౌ అండ్ వావ్ షోరూమ్ నిర్వాహకులు తరుణ్ తెలిపారు. గురువారం ఈ వివరాలను ఆయన వెల్లడించారు. రాజమహేంద్రవరం జెఎన్ రోడ్‌లోని ఐరన్ గ్రిల్ ఎదురుగా ఉన్న దారా గ్రౌండ్స్‌లో రాజమహేంద్రవరం బ్రీడ్స్ ఛాంపియన్‌షిప్ డాగ్‌షో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మెట్రో సిటీల్లో ఈ షోలు నిర్వహిస్తున్నారన్నారు. నగరంలో తొలిసారి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే వందకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయని వివరించారు. ఒడిశా, భీమవరం, విజయవాడ, విశాఖపట్నం, తదితర మెట్రో సిటీల నుంచి కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. సింగిల్ డాగ్‌తో పాటు ఇద్దరికీ ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఈ షో ద్వారా వచ్చే ఆదాయాన్ని వీధి కుక్కల ఆరోగ్య సంరక్షణకు ఖర్చు చేస్తామన్నారు. ఈ షోలో వివిధ రకాల స్టాల్స్‌తో పాటు డాగ్స్‌కు సంబంధించిన ఫుడ్ ఐటమ్స్, డ్రెస్ మెటీరియల్స్ ఇతర స్టాల్స్ కూడా ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి 24వ తేదీ సాయంత్రంలో రిజిస్ట్రేషన్ల కోసం 8555845656, 8500845656, 7981888191 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కడియం

రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని జిల్లా ఇన్చార్జి మంత్రి, వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణు అన్నారు. కడియం ఆకుల సుబ్బారావు నర్సరీ నుంచి జాతీయ రహదారి వరకు నిర్మించే సిసి రోడ్ల నిర్మాణ పనులకు గురువారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ నియోజక వర్గంలో అంతర్గత రహదారుల అభివద్ధి వేగవంతం చేస్తున్నామన్నారు. నియోజక వర్గంలో స్వచ్ఛత మన అందరి బాధ్యత లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని మంత్రి సూచించారు. ఇప్పటికే మెరుగైన పారిశుధ్యం దిశగా చర్యలు చేపట్టి నియోజకవర్గంలో పలు మురుగు నీటి డ్రైనేజీలను రూ.3.5 కోట్లతో శంఖుస్థాపన చేసుకున్నామన్నారు. రూరల్ నియోజక వర్గంలో రహదారుల అభివద్ధి, డ్రైనేజీ, మంచినీటి, పైపులైన్లు, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల సుందరీకరణ తదితర మౌలిక వసతుల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజ్ మనోజ్, వైసిపి నాయకులు గిరజాల బాబు, వై.స్టాలిన్, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, డాక్టర్ అనసూరి పద్మలత, తిరుమల శెట్టి శ్రీను, లావేటి రమేష్, ఊటుకూరి శైలజ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు



కవలల దినోత్సవంలో పాల్గొన్న భాష్యం పాఠశాలలో కవలలు

'భాష్యం'లో కవలల దినోత్సవం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలోని భాష్యం స్కూల్లో గురువారం కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్లో పన్నెండు మంది కవల జంటలు చదువుతున్నారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరేసి, ముగ్గురేసి చొప్పున ఉన్నారు. బిక్కిన అనిష్, త్రివర్షిత కవలల దినోత్సవం రోజున పుట్టడంతో వారి పుట్టినరోజు వేడుకలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహశీల్దారు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 44 పోలింగ్ కేంద్రాలను, ఏర్పాట్లను అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి, తహశీల్దారు శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-పెరవలి, తాళ్లపూడి

పెరవలి విద్యుత్ ఉపకేంద్రంలోని తీపర్రు ఫీడర్ మరమ్మతులు, ట్రీ కట్టింగ్‌లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఇఇ బి.వీరభద్రరావు, ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తీపర్రు, అజ్జరం, వెంకటరాయపురం పరిసర గ్రామ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సమయాలు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు, అనంతరం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మార్చినట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా కోరారు.

తాళ్లపూడిలో విద్యుత్ లైన్స్ మెయింటెనెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఐదు గ్రామాల్లో విద్యుత్ కోత విధిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వీరభద్రరావు తెలిపారు. తాళ్లపూడి, కుకునూరు, వేగేశ్వరపురం, ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని ఇఎ సిహెచ్ వెంకట్రావు కోరారు.

ముగ్గురు విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని గంగోలు పరిధిలో యర్రవరంలో ఎంపిపి పాఠశాలకు వెళ్లి వచ్చిన ముగ్గురు విద్యార్థులు అస్వస్థత గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పాఠశాలలో ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు సుమారు 36 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఐదో తరగతి విద్యార్థి గౌతమ్, మూడో తరగతి విద్యార్థి అవినాష్, నాలుగో తరగతి విద్యార్థి సిద్ధూ బుధవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. సాయంత్రం ఇంటికి వెళ్లారు. రాత్రి సమయంలో వారికి వాంతులు, విరోచనాలు కావడంతో స్థానిక పిహెచ్‌సికి తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స అందించిన తర్వాత ఒకరిని తాళ్లపూడి ప్రైవేట్ ఆసుపత్రికి, ఇద్దరిని గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు. ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన విద్యార్థి సిద్ధూకు పరీక్షలు నిర్వహించగా టైఫాయిడ్ అని వైద్యులు ధ్రువీకరించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వర రావు పరామర్శించారు. వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఎంఇఒలతో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడారు. పాఠశాలలో వంటలు సక్రమంగా లేవని, పరిశుభ్రత లేదని చెప్పారు. దీనిపై ఎంఇఒలు శ్రీనివాసరావు, మహేశ్వరరావు మాట్లాడుతూ దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, వైద్య పరీక్షల రిపోర్టు అందగానే పేరెంట్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం డి.జాన్ మాట్లాడుతూ బుధవారం మెనూలో భాగంగా వెజిటబుల్ రైస్, బంగాళదుంప, వంకాయ కూర తయారు చేశారని అన్నారు. వంటలను ఉపాధ్యాయులు టెస్ట్ చేశారని తెలిపారు. పాఠశాలలో మిగిలిన విద్యార్థులు ఆరోగ్యంగానే ఉన్నారని ఆయన తెలిపారు. గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హేమ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు.




ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున ఎంఇఒలు

దమ్మెన్నులో గడప గడపకూ మన ప్రభుత్వం..

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు గడప గడపకు అందుతున్నది లేనిది తెలుసుకునేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి గడపగడపకు కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని దమ్మెన్నులో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, మహిళలు, యువత, రైతులతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, కఠారి సిద్ధార్థ రాజు, ఎంపిటిసి రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్ నాయుడు

హాస్పిటల్స్ సిబ్బందికి బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రైవేట్ హాస్పిటల్స్ సిబ్బందికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని రాజమండ్రి ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నరివ్సగ్ హోమ్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గాంధీపురంలోని సిఐటియు స్తూపం వద్ద యూనియన్ పతాకాన్ని యూనియన్ అధ్యక్షుడు శ్రీను ఎగురవేశారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు శ్రీను, నాయకులు బి.రాజులోవ మాట్లాడారు. ప్రైవేట్ హాస్పిటల్లో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు కొందరికే ఉన్నాయని చెప్పారు. ఆసుపత్రి యాజమాన్యాలు నిత్యావసర వస్తువుల ధరలు, ఇతర ఖర్చులను దృష్టిలో ఉంచుకొని వేతనాలు పెంచాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న వేతనాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని, ఇప్పుడు ఇచ్చే వేతనాలతో కుటుంబాల పోషణ కష్టమవుతుందని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ప్రైవేట్ హాస్పిటల్స్ నర్సింగ్ హోమ్ సిబ్బందికి ఏమి చేస్తారో పొందుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నావేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.






తనిఖీలు నిర్వహిస్తున ఎస్ఐ, పోలీసులు

పత్రాలు లేకుంటే ఫైన్ చెల్లించాల్సిందే

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వాహన చోదకులు తమ వాహనానికి సంబంధించిన పత్రాలను తప్పనిసరిగా వాహనంతో పాటు ఉంచుకోవాలని ఎస్ఐ వి అప్పలరాజు వాహన దారులకు సూచించారు. గురువారం మండల కేంద్రం ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వాహన తనిఖీలు చేశారు. అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనానికి సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, టాక్స్ సర్టిఫికెట్లతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. బైకు ప్రమాదాల్లో అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాపాయానికి గురవుతున్నారన్నారు. కార్లు నడిపేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఉండ్రాజవరం, తాడిపర్రు రహదారి మధ్యలో ఆకతాయి వ్యక్తుల ఆగడాలను అరికట్టామని, ప్రయాణికులు భయం లేకుండా రాత్రి వేళల్లో సైతం ప్రయాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నాగేశ్వరరావు, జయరాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'





విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి వేణు తదితరులు

రంగా, జక్కంపూడి విగ్రహాల ఆవిష్కరణ

కడియం : జేగురుపాడులో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నేతలు వంగవీటి మోహన రంగా, జక్కంపూడి రామ్మోహన్ రావు విగ్రహాలను మంత్రి వేణుగోపాలకృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు, సర్పంచ్ స్టాలిన్ మాట్లాడుతూ జక్కంపూడి అంటే వ్యక్తి మాత్రమే కాదని శక్తి అన్నారు. ఆయన తమలాంటి వాళ్ళకెందరికో రాజకీయ గురువని, జక్కంపూడితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదల పక్షాన నిలబడిన నాయకులన్నారు. తొలుత నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కన్వెన్షన్ హాల్‌ను సర్పంచ్ స్టాలిన్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందన నాగేశ్వర్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్, గిరజాల బాబు, మాజీ సర్పంచ్ యాదల దేవ దీవెన కుమారి, ఎంపిటిసి సభ్యులు ఆకుల సుధాకర్ పాల్గొన్నారు.

పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నేటి నుండి జరగనున్న పదవ తరగతి ప్రి పబ్లిక్ పరీక్షలను, ఒకటి నుండి తొమ్మిదవ తరగతి వరకు జరుగునున్న ఫార్మేటివ్–4 పరీక్షలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని డిఎస్ఇఒ కె.వాసుదేవ రావు హెచ్‌ఎంలను ఆదేశించారు. ధవళేశ్వరంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఆరో తరగతిలో విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఫార్మేటివ్–4 పరీక్షలకు సంబంధించి సిలబస్ పూర్తి అయిందా, ఉపాధ్యాయులు విద్యార్థుల నోట్ బుక్స్ కరెక్షన్ చేసి రిమార్కులు రాసారో లేదో పరిశీలించారు. విద్యార్థులను సిలబస్ పై కొన్ని ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతిలో ఉన్న విద్యార్థులు అందరూ విధిగా ఆ తరగతి స్థాయిలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రధానోపాధ్యాయులు కూడా ఉపాధ్యాయుల అకడమిక్ అంశాలను తరచూ పరిశీలించి సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

22 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక మెయిన్ రోడ్‌లోని వినియోగంలో లేని బడ్డీకొట్లో అక్రమంగా నిల్వ చేసిన 22 మద్యం సీసాలను జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిటిసి ఎస్ఐ మహ్మద్ అలీ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు గురువారం మూతపడ్డ బడ్డి కొట్లో తాళాలు పగలగొట్టి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. విఆర్ఒ కె.సత్యారావు సమక్షంలో బడ్డీ కొట్టు తాళం తీశామన్నారు. మద్యం సీసీలను ప్రత్తిపాడు ఎక్సైజ్ కార్యాలయానికి తరలించామన్నారు. నిందితులను గుర్తించి కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఆయన వెంట డిటిసి హెచ్‌సి ఇ.ప్రసాద్, కానిస్టేబుల్ నీలిమ, ప్రసాద్, గంగాధర్ ఉన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని రామరాఘపురం శివారులో నిర్వహిస్తున్న సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ స్వామినాయుడు మాట్లాడుతూ ముందస్తుగా వచ్చిన సమాచారంతో డిఎస్‌పి హనుమంతరావు పర్యవేక్షణలో ట్రైనింగ్ డిఎస్‌పి కె.ప్రమోద్‌తో కలిసి దాడి చేశామని తెలిపారు. ఈ దాడిలో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బట్టీ నిర్వాహకుడు కొత్త మూలపేటకు చెందిన ముత్తు తాతారావుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నగదు, బంగారం చోరీ

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం పోతవరం గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం ఘరానా దోపిడీ జరిగింది. బాధితులు నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బంగారు నగల వ్యాపారి గారలి బాలు రూ.5 లక్షల నగదు, మూడున్నర కాసుల బంగారంతో కారులో భీమవరం వెళ్తున్నాడు. నల్లజర్ల మండలం పోతవరం సమీపంలో నలుగురు మరో కారులో వచ్చి పోలీసులమని చెప్పి అడ్డగించారు. వ్యాపారిని వారి కారులో ఎక్కించుకున్నారు. రూ.5 లక్షల నగదు, మూడున్నర కేజీల బంగారు నగలను స్వాధీనం తీసుకున్నారు. వ్యాపారిని రాజమహేంద్రవరంలోని లాలాచెరువు సమీపంలో వదిలి పరారయ్యారు. దిక్కు తోచని స్థితిలో ఆ నగల వ్యాపారి బొమ్మూరు పోలీసులను ఆశ్రయించాడు. వారు నల్లజర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. నల్లజర్ల పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక కంబాలపాలెం దళితపేటకు చెందిన యువతి(18) ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి సూసైడ్ నోటు రాసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించారు. వినోద్ మిస్రా నగర్‌కు చెందిన రవి, తాను ప్రేమించుకున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. బుధవారం రవికుమార్ ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లగా అతని కుటుంబ సభ్యులు తనను నానా దుర్భాషలాడారని పేర్కొంది. మనస్థాపంచెంది ఆత్మహత్యకు పాల్పడుతున్నానని తన చావుకు రవి, అతని కుటుంబ సభ్యులే కారణమని అందులో పేర్కొంది.

సారా, మద్యం విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి-కడియం, చాగల్లు, రౌతులపూడి

కడియం మండలంలోని దుళ్ల, జేగురుపాడు శివారు పాములమెట్టలో నాటుసారా అమ్ముతున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. ఒక్కొక్కరి వద్ద నుండి 10 లీటర్ల సారా చొప్పున స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. కేసులు నమోదు చేసి వారిని న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు కృష్ణ సాయి, నాగదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చాగల్లు మండలం కలవలపల్లిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక మహిళను అరెస్టు చేసినట్టు ఎస్‌క్మి పి.నాగరాజు తెలిపారు. ఆమె వద్ద నుండి 16 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

రౌతులపూడి మండలంలోని ఎస్.పైడిపాలలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు అతని వద్ద నుంచి 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చొప్పెల్లలో వివాహిత హత్య

ప్రజాశక్తి-ఆలమూరు

చొప్పెల్లలో ఒక వివాహిత హత్యకు గురైంది. సిఐ ఎం.రామకుమార్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని చొప్పెల్లకు చెందిన వివాహిత సలాది మరియాకుమారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాడు. దీంతో ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. మరియాకుమారికి బిక్కవోలు మండలం మేళ్లూరుకు చెందిన చల్లా దుర్గా నాగప్రసన్నకుమార్‌తో వివాహేతర సంబంధం ఉందన్నారు. అతడు రెండేళ్లుగా గ్రామంలో తన అక్క బావలకు చెందిన ఇటుకబట్టీని నిర్వహిస్తున్నాడని తెలిపారు. మరియకుమారి, ఆమె భర్త ఇటుకబట్టీలోనే పనిచేసేవారన్నారు. ఈ సమయంలోనే ప్రసన్న కుమార్‌కు మరియకుమారికి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలిపారు. ఇటీవల ఆమె మరో యువకునితో చనువుగా ఉంటుందన్నారు. ఈ విషయమై మరియకుమారి, ప్రసన్నకుమార్ మధ్య వాగ్వాదం చెలరేగిందన్నారు. ఈ సమయంలో ప్రసన్నకుమార్ మరియకుమారిని కోపంతో కొట్టి, గొంతు నొక్కి, ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడుతో గట్టిగా లాగడంతో స్పృహ కోల్పోయి చనిపోయినట్లు నిందితుడు తెలిపినట్లు సిఐ చెప్పారు. నిందితుడు గురువారం తాహశీల్దార్ వద్ద లొంగిపోయాడన్నారు. మరియకుమారి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణకు మూలం 'స్కౌట్'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్య సాహసాలు, సేవా గుణాన్ని అలవర్చేందుకు 'స్కౌట్' ఎంతగానో ఉపయోగపడుతుందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని ఈస్ట్ రైల్వే కాలనీ, న్యూ రామాలయం వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పావెల్ విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్కౌట్ బాయ్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన స్కౌట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమాజంలో పోలీసులు ప్రజలకు ఎలా సేవలందిస్తారో, అదే విధంగా విద్యార్థి దశ నుంచి సేవలు అందించేందుకు స్కౌట్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. తద్వారా సమాజ సేవ, క్రమ శిక్షణ, సేవాతత్పరత అలవడతాయన్నారు. భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని చెప్పారు.



స్కౌట్ విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న ఎంపీ భరత్

రాజమండ్రి రైల్వే స్టేషను అభివృద్ధికి రూ.260 కోట్లను కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసిందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో రాజమండ్రి రైల్వే స్టేషన్లో 4, 5 ప్లాట్ ఫారమ్స్ తీసుకొచ్చామన్నారు. రాజమండ్రి విమానాశ్రయం రూ.355 కోట్లతో ఎలా అభివృద్ధి జరుగుతుందో అదే మాదిరిగా రైల్వే స్టేషన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వే ప్రధాన స్టేషను అయిదు బళ్ల మార్కెట్ వద్దకు మారబోతోందని చెప్పారు. ఈ నెలలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని ఎంపీ భరత్ తెలిపారు. మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కానున్నాయని, మరో అయిదారు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు రాజమండ్రి జాతీయ రహదారిపై నిర్మితం కానున్నాయన్నారు. రానున్న రోజుల్లో నగర ముఖ చిత్రం పూర్తిగా మారబోతోందని ఎంపీ భరత్ తెలిపారు.



పుదుచ్చేరి సిఎస్‌ను కలిసిన ఎంఎల్ఎ అశోక్

పుదుచ్చేరి సిఎస్‌ను కలిసిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్‌ను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పుదుచ్చేరి అసెంబ్లీలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం యానానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ఒఎన్‌జిసి నష్టపరిహారం త్వరగా అందేలా చూడాలని కోరినట్టు ఎంఎల్ఎ తెలిపారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



సమావేశంలోవ పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

బడ్జెట్ సమావేశంలో ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో యానాం ఎంఎల్ఎ శ్రీనివాస్‌అశోక్ పాల్గొన్నారు. వచ్చే ఐదు నెలల కాలానికి రూ.4,634.29 కోట్లతో కూడిన మధ్యంతర బడ్జెట్‌ను గురువారం ఆర్థికమంత్రి హెూదాలో పుదుచ్చేరి సిఎం రంగసామి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. స్పీకర్ సెల్వం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ఎంఎల్ఎలు పాల్గొన్నారు. ఈ మొత్తం ఏప్రిల్ నుంచి ఆగష్టువరకు ఖర్చుచేయనున్నారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదావేశారు. ఈ సమావేశాన్ని డిఎంకె, కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు.

బిజెపికి అధికారంలో కొనసాగే అర్హత లేదు

ప్రజాశక్తి -దేవరపల్లి

యువ రైతు కరణ్ సింగ్ మృతికి కారణమైన కేంద్ర బిజెపి ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక అర్హత లేదని రైతు సంఘం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు అన్నారు. ఢిల్లీలో రైతుల పోరాటంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం హర్యానా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధానికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం దేవరపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు ఈ సందర్భంగా ఉండవల్లి కష్ణారావు కృష్ణారావు మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర కోరుతూ రైతులు చేస్తున్న న్యాయమైన ఆందోళనపై బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు గత ఆందోళన సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రైతులపై యుద్ధం చేస్తోందని విమర్శించారు. రైతులు ఉద్యమాన్ని సైన్యంతో అణిచివేయాలని చూడడం అవివేకమన్నారు. రైతుల డిమాండ్లను సానుకూలంగా స్పందించి పరిష్కరించకపోతే ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పిన్నమనేని సత్యనారాయణ, ఆచంట సుభాష్ చంద్రబోస్, నడిగట్ల రామారావు, ఘట్టం నాని, సిఐటియు మండల కార్యదర్శి భగత్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

అన్ని శాఖల సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన పల్స్ పోలియో సమన్వయ కమిటీ సమావేశంలో డాక్టర్ గంగాధరరావు మాట్లాడారు. వచ్చే నెల మూడో తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని అందరం బాధ్యతాయుతంగా వ్యవహరించి విజయవంతం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు రెవెన్యూ, విద్య, అంగన్వాడీ శాఖల అధికారులతో సమావేశమైన వైద్యాధికారి డాక్టర్ గంగాధరరావు నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష జరిపారు. ప్రతి గ్రామంలో పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. తహశీల్దారు వర్ధనపు కిషోర్ కుమార్ మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కోసం ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు, అంగన్వాడీ టీచర్లకు ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం తమ వంతుగా రెవెన్యూ శాఖ తరపున ఎలాంటి సహాయ సహకారాలైనా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తామన్నారు. వ్యాక్సిన్‌కు ఎటువంటి కొరత లేకుండా సరిపడా సిద్ధం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వై.సత్యనారాయణ, బి.భగవతీదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు టి.వెంకటలక్ష్మి, ఎం.హారతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గంగాధర్ రావు



వాలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి వేణు గోపాల కృష్ణ

ఆదర్శంగా వాలంటీర్ వ్యవస్థ

ప్రజాశక్తి-కడియం

సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ, అనుబంధంగా వాలంటీర్ సేవా వ్యవస్థను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని జిల్లా ఇన్చార్జి మంత్రి, వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కార అవార్డులను మంత్రి అందజేశారు. కడియం మండలంలో 482 మంది వాలంటీర్లకు ప్రోత్సాహాన్ని అందించినట్లు మంత్రి వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, వైసిపి నాయకులు గిరజాల బాబు, యాదల సతీష్ చంద్రస్టాలిన్, రాష్ట్ర దేవాంగ దొంతంశెట్టి చినవీరభద్రయ్య, తడాల చక్రవర్తి, ఈలి గోపాలరావు, టేకి శ్రీనివాస్, దాసరి శేషగిరి, లావేటి రమేష్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ఎంఎల్ఎ జక్కంపూడి రాజా గురువారం ప్రారంభించారు. ముక్కినాడ పాకల్లో రూ.45 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి, రూ.58.50 లక్షలతో మరో ఓవర్ హెడ్ ట్యాంక్, రూ.13 లక్షలతో ఎస్‌సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.15.74 లక్షలతో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. మల్లంపూడిలో రూ.46 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌క శంకుస్థాపన, రూ.20.8 లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి, కొండగుంటూరులో రూ.63.4 లక్షలతో, జి.ఎర్రంపాలెంలో రూ.63.4 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జక్కంపూడి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివద్ధి చేస్తున్నామన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రజలకు మంచి నీటి సమస్యలు పరిష్కరించామని చెప్పారు. ఈ కార్యకమాల్లో వైసిపి మండల కన్వీనర్ దూలం పెద్ద, జెడ్‌పిటిసి వాసంశెట్టి పెదవెంకన్న, మందారపు వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వరరావు, ముక్కినాడ సాయిరాం, వేమగిరి కృష్ణ, మల్లంపూడి సర్పంచ్ ముప్పిరిశెట్టి చక్రవర్తి, బోయిడి సుబ్రహ్మణ్యం, కొండ గుంటూరు సర్పంచ్ సాయి, ఎంపిటిసి శివ రామ్ తదితరులు ఉన్నారు.



ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రాజా



గన్ని కృష్ణకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

గన్ని కృష్ణకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కష్ణకు గురువారం మధురపూడి విమానాశ్రయంలో పార్టీ నాయకులు ఘనంగా స్వాగతించారు. చెన్నైలో గుండెకు పేస్ మేకర్ మార్పు కోసం సర్జరీ చేయించుకుని ఆయన తిరిగి వచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, గంగిన హనుమంతరావు, అర్బన్ అధ్యక్షులు రెడ్డి మణి, నాయకులు ఉప్పులూరి జానకిరామయ్య, కంటిపూడి శ్రీనివాస్, సంసాని ప్రసాద్, విశ్వనాథరాజు, రామినేని మస్థాన్ చౌదరి, చోడిశెట్టి వెంకన్న, జక్కంపూడి అర్జున్, కెవి శ్రీనివాస్, రాయి అప్పన్న, కవులూరి వెంకట్రావు, ఉమామహేశ్వరరావు, షేక్ మదీనా, పెందుర్తి నాగమణి, దొరబాబు, నల్లం ఆనంద్, కంచిపాటి గోవింద్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

'నా ఉపాధికి గండికొట్టొద్దు' చిరుద్యోగి ఆవేదన

ప్రజాశక్తి-మండపేట

తన ఉపాధికి గండి కొట్టి, తన కుటుంబానికి అన్యాయం చేయొద్దని ఇప్పనపాడు గ్రామానికి చెందిన చిరుద్యోగి వీరుళ్ల సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండపేటలో విలేకరుల సమావేశంలోఆయన తన గోడు వెళ్లబోసుకున్నాడు. 2022లో తాను తాపేశ్వరం లాకులవద్ద ఒప్పంద పరిధిలో లస్కర్‌గా విధుల్లో చేరానని అన్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తన పైఅధికారి జెఇ అజీజ్ ఆయన వ్యక్తిగత పనులకు వాడుకున్నారని అన్నారు. అంతే కాకుండా గడ్డిమందు అమ్మాలని, లాకుల వద్ద ఉన్న కొబ్బరి, అరటి, పనస వంటి ఫలసాయం అమ్మి వచ్చే ఆదాయం అక్కడి జెఇతో పాటు ఇతర సిబ్బంది తమ జేబులో వేసుకొంటున్నారని వాటికి అడ్డుగా వున్నాననే ఉద్దేశ్యంతో తనపై కక్షగట్టి ఉద్యోగం నుంచి తొలగించారన్నాడు. ఈ కారణంగా తాను అయిదు నెలల జీతం కోల్పోయానని అన్నాడు. తాను దళితుడైనందునే తనను ఉద్యోగం నుంచి తప్పించారని ఈ విషయంపై స్పందనలో ఫిర్యాదు చేసినా, లేబర్ అధికారులను, ఉన్నతాధికారులను కలిసినా న్యాయం జరగ లేదని కన్నీరు పెట్టుకున్నాడు. నాయకులు, అధికారులు స్పందించి తనకు ఉద్యోగం ఇప్పించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణంలో రూ.19.00 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల హాస్పిటల్ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను నియమించడమే కాక అదనంగా ఆక్సిజన్, డిజిటల్ ఎక్స్ రే, డెంటల్ సేవలు, బ్లడ్ బ్యాంకు, ఆధునిక లాబరేటరీ ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ల నియామకం, సదుపాయాల కల్పన తరువాత నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి పేషేంట్ల తాకిడి పెరిగిన విషయాన్నీ నిడదవోలు కాపు నేస్తం కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రివై.యస్. జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల హాస్పిటల్‌గా అభివద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరామనానరు. అదే బహిరంగ సభ వేదిక మీద సిఎం జగన్ రూ.19.00 కోట్లు మంజూరు చేశారన్నారు. నిడదవోలు ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడానికి శంఖుస్థాపన చేశామన్నారు. నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో అతి త్వరలో డయాలిసిస్ సదుపాయం కూడా అందుబాటులో తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్లు, నిడదవోలు ఎంపిపి, జెడ్‌పిటిసి, హాస్పిటల్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ నాయుడు

సాగునీటి ఎద్దడితో రైతుల ఆందోళన

ప్రజాశక్తి -మామిడికుదురు

నగరంలో గుర్రాల చెరువు ప్రాంతంలో సాగునీరు అందక వరి చేలు ఎండి పోతున్నాయంటూ గురువారం రైతు లు నెర్రలు తీసిన చేలు లో అధికారుల తీరు నిరసిస్తూ ఆందోళన చేశారు. సుమారు 200ఎకరాలకు సాగునీరు అందక పొట్ట దశలో ఉన్న చేలు నెర్రలు తీసి ఎండిపోతున్నాయని వాపోయారు. వంతుల వారీ నీరు అందిస్తా మన్న అధికారులు ఆ విధానాన్ని అమలు చేయడం. లేదన్నారు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన నిర్లక్ష్యం గా వ్యవహరిసున్నారన్నారు. ఇప్పటి వరకు ఎకరాకి రూ.30వేల పెట్టుబడి పెట్టామని రైతు తాటికాయల ఉదయభాస్కర్ తెలిపారు. కడలి సత్యనారాయణ, బొంతు భాస్కరావు, వి.సుబ్బలక్ష్మి, విత్తనాల సూర్య కాంతం, కూన నరసింహారావు పాల్గొన్నారు.



పొలంలో రైతుల నిరసన